ఎక్స్ట్రా

"ఇట్లా అయితే నేనీ ఆట ఆడను. ఈ పట్టుపోగొట్టి బంగారంలాంటి ఆట చెడగొట్టావు". అంటూ వేలాయుధం చేతిలో పేకముక్కలు విసిరి గొట్టాడు. భైరవ మూర్తి వేలాయుధం వంక కళ్ళు పెద్దవి చేసికొని చూశాడు. వేలాయుధం మళ్ళీ అసలు తాగిన వాళ్ళను చూస్తేనే నాకు వళ్ళు మంట. తాగి వచ్చిన వాడివి ఒక మూల కూర్చోక నీకీ ఆట ఎందుకు." అంటూ లేచి వెళ్ళి కిటికీలో నుంచి బయటకు చూస్తూ నిలబడ్డాడు.

ఉదయం ఎనిమిది గంటల వేళ... ఆగదిలో మొత్తం నలుగురు వున్నారు. వారి కోసం మరి కాసేపట్లో రాబోయే వ్యాను కోసం ఎదురు చూస్తున్నారు. ఆ మేస్త్రీ వచ్చాడంతే ఇక ఊపిరి కూడా పీల్చుకోనివ్వడు. "అవతల నామాట పోతుంది. మీరందరు త్వరగా కదిలి రాకపోతే అక్కడ కొంపలంటుకుపోతాయి." అంటూ గోల చేస్తాడు. క్రింద వ్యాను హారన్ వినిపించగానే త్వరత్వరగా గది తలుపుకు తాళం వేసి రెండేసి మూడేసి మెట్లు ఒక్కొక్క అంగలో దూకుతూ వెళ్ళి వ్యానులో కూర్చుంటారు ఆ నలుగురు...

మిగిలిన ముగ్గురు కూడా పేక ముక్కలు ఒక మూలకు విసిరిపారేసి విశ్రాంతిగా కూర్చున్నారు. భైరవమూర్తి సిగరెట్టు ముట్టించి తీరికగా పొగలు వదులుతూ కూర్చున్నాడు. అతడు ఆరడుగల భారీ మనిషి. అతనిది కడప దగ్గర ఏదో ఊరు. చిన్నప్పుడు నాటకాల మీద ఆసక్తితో చదువు పాడు చేసుకున్నాడు. అప్పుడప్పుడు ఏవేవో నాటకాలతో వేషాలు వేస్తుండేవాడు. కొన్ని చిన్న పరిషత్తులలో పాల్గొని సహాయ నటనకు "ప్రత్యేక గుర్తింపు " కూడా పొందివున్నాడు. ఉన్న కొద్ది ఆసక్తి కరిగి పోగానే ఇక్కడకు వచ్చి సినిమాల్లో పెద్ద నటుడుగా పేరు పొందాలని ఆరాటపడ్డాడు. మనిషి చూపులకు భారీగా కనిపించినప్పటికి ముఖంలో ఏ భావము పలుకని కారణంగా అతన్ని అదృష్ట దేవత వరించలేదు. దానితో అతనివంటి వందల కొద్ది వ్యక్తులలో ఒక్కడైపోయాడు. అప్పుడప్పుడు మనసు బాగా లేనప్పుడు కొద్దిగా తాగుతూ వుంటాడు. అతని మనసు చాలా తరుచుగా బాగుండకపోవటం కూడా యధార్థమే.

వామనరావు పేరుకు తగ్గట్టు పిట్టవంటి మనిషి. తల మీద గుప్పెడు జుట్టుకూడా వుండదు. కీచుగొంతు. నిజానికి ఆ నలుగురిలోను ప్రస్తుతానికి అతని పరిస్థితి కొంత నయం. నాలుగైదు చిత్రాలలో హాస్య వేషాలు వున్నాయి. ఒక జానపద చిత్రంలో కొంచెం పెద్ద వేషమే వేస్తున్నాడు.

మూడోవాడు వెంకటేశం... కాళ్ళు బార్లా జాపుకొని కూర్చుని "ప్రేమకోసమై వలలో పడెనే" అంటూ పాడుతున్నాడు. అతడు కొంచెం కలవారి చిన్నవాడు. ఇంట్లో చెప్పకుండా కొంత డబ్బు కాజేసి అయిదారు నెలల క్రిందటనే ఇక్కడకు పారిపోయి వచ్చాడు. అతని తండ్రి ఒక దిన పత్రికలో "కనిపించటం లేదు" అనే శీర్షిక కింద "నాయనా వెంకటేశు నీ కొరకు ఇంటిల్లిపాది దిగులు పడుతున్నాము. నీ వెక్కడున్నది తెలియచేస్తే డబ్బు పంపుతాను. నీవు కోరినట్లు చేయగలము. వెంటనే బయలుదేరి రావలసినది." అని ప్రకటన కూడా వేయించాడు. అయినా వెంకటేశం తాను పెద్ద నటుడినైన తర్వాతగాని ఇంటి మొహం చూడని భీష్మించుకొని కూర్చున్నాడు.

ఇక వేలాయుధం...తెలుగువాడే...అతనిది సరిహద్దు జిల్లాలో ఏదో చిన్న ఊరు. అతనికి ప్రపంచంలో ఎవరూ లేరు. అతని కోసం దిన పత్రికలో ప్రకటనలు వేయించేవారు ఎవరూ లేరు. అతని కోసం బాధ పడేవారు ఎవరు లేరు. సినిమా ప్రపంచంలో సాటిలేని మేటి నటుడిగా పేరు పొందాలని అతనికి లేదు. అందుకు అవసరమైన ఏ అర్హతలు తనలో లేవనీ అతనికి తెలుసు. నిజానికి రోజూ పని అయిపోగానే మేస్త్రీ అందరితోపాటు యిచ్చే మూడున్నర రూపాయలూ అతనికి చాలా అవసరం. అందుకోసమే అతడిక్కడ పడివున్నాడు. ఈ మాత్రపు సంపాదన ఎక్కడో మరొకచోట, ఏ ఆఫీసులో వాటర్ బోయ్‌గా పనిచేసినా, లేక పంకా లాగుతూ కూర్చున్నా వుండకపోదు. అయినా అతన్ని కాలు కదపకుండా ఆ వాతావరణానికి కట్టిపడేసిన ఆకర్షణ వేరే వుంది. ఇవాళ అతని లోలోపల ఒక హుషారు కలిగి అతన్ని నిలవనీయడంలేదు. ఇవాళ తాము పనిచేయబోయే సినిమా చివరి దశలో పడింది. అదొక భారీ జానపద చిత్రం. అందులో ప్రధాన నాయిక వనజ. వేలాయుధం కళ్ళు మూసుకున్నాడు. ఆమె రూపమే అతని మనసులో మెదిలింది. ఆమెకు వయస్సెంత వుంటుందో ఖచ్చితంగా ఎవరికీ తెలియదు. అయినా చూసేవారికి పందొమ్మిదేళ్ళ పిల్లవలె కనిపిస్తుంది. ఆమె అందం మత్తుమందు వంటిది. ఆమె వున్నచోట ఎవరికీ ఏమీ తోచదు. అందరూ తమ పనేమిటో, తామేం చెయ్యాలో మరచిపోయి ఒకరిమీద ఒకరు కేకలేసుకుంటూ వుంటారు. మరి నిన్నటి షూటింగ్ సందర్భంలో ఆ చెవిటి అసిస్టెంటు డైరెక్టరు చేసిన హడావిడి యింతా అంతా కాదు. మాటిమాటికి ముక్కుమీదకి జారుతున్న అద్దాలు సర్దుకుంటూ హియరింగ్ ఎయిడ్ సర్దుకుంటూ, అతడు తాను కంగారుపడి ఇతరులను కూడా కంగారుపెట్టి ప్రాణాలు తీశాడు. వనజ ముందు నిలబడి వున్న వేలాయుధాన్ని చూపుడు వ్రేలితో దగ్గరికి రమ్మని సైగచేసి "నువ్వు యింకా ఇక్కడెందుకు నిలబడి వున్నావు? అలా గుడ్లప్పగించి లాంతరు స్తంభంలా నిలబడకపోతే వెళ్ళి మొహానికి మేకప్ కొట్టించుకోరాదూ? అవతల రిలీజింగ్ డేట్ పీకలమీదకి వస్తున్నది. ఫో త్వరగా..." అన్నాడు. వేలాయుధానికి అతని వైఖరి గొప్ప చిరాకు కలిగించింది. అగ్గిమీద ఆజ్యంలాగా వనజ ఆ మాటలు విని మరీ పమిటచెంగు నోటి కడ్డం పెట్టుకుని పెద్దగా నవ్వడం...

క్రింద ఏదో చప్పుడు వినిపించి కిటికీ లోంచి తొంగి చూశాడు వేలాయుధం. శేఖర్ తన డొక్కు ఫారిన్ సైకిలును గోడ కానించి తాళం వేసి హడావిడిగా పైకి వస్తున్నాడు. అతడొక మళయాళీ. కండలు తిరిగిన శరీరంతో చిన్నసైజు వస్తాదులా వుంటాడు. నాలుగైదు సినిమాలలో సైడ్ విలన్‌కు కుడి భుజంగా నటించి కుస్తీలు పట్టాడు.

అతడు గదిలోకి రావడమే సుడిగాలిలా వచ్చాడు. వస్తూనే చేతిలో పేపరు భైరవమూర్తి మొహాన కొట్టి కూర్చుంటూ "నిన్న రాత్రే ప్రధానం. రేపు సాయంకాలమే పెళ్ళి... పేపర్లో అచ్చు పడింది..." అన్నాడు. ఇక యితర వివరాలు చెప్పకుండా ఒక ప్రక్క కూర్చున్నాడు. అతడు ఉదయమే బయలుదేరి ఎందరికి ఈ ప్రధానం వార్త అందించి వస్తున్నాడో? బాగా అలసిపోయి వున్నాడు. ఆ డొక్కు సైకిలు మీద పట్నం అంతా చెడతిరిగి వుంటాడు. అతని కేదయినా విషయం తెలిస్తే ఊరంతా అంటించేదాక నిద్రపోడు. ఆ ఫారిన్ సైకిలు అతనికి బహు ప్రాణం. ఎప్పుడో ఎవరో విదేశీ ఫాదరీ దగ్గర అతడు

వంటవాడుగా పని చేశాడు. ఆ ఫాదర్ తన దేశానికి వెళ్ళిపోతూ నమ్మకంగా తన దగ్గర పనిచేసిన శేఖరుకు ఆ సైకిలు బహూకరించి వెళ్ళాడు. అతడు దాని మీద ఊరంతా రౌండ్లు కొడుతూ వుంటాడు.

వామనరావు అతనికి ఒక గ్లాసెడు మంచినీళ్ళు అందించి "సరిగ్గా చెప్పవయ్యా? నీ మళయాళం పేపరులో ఏంవేశారో మాకెలా తెలుస్తుంది? ఎవరికి ప్రధానం ఏమిటి కథ?" అని అడిగాడు.

శేకర్ వేలాయుధం వైపు తిరిగి నవ్వి తర్వాత గొప్పవార్త చెప్పబోతున్న వాడిలా పోజుపెట్టి "వనజమ్మగారిది... పెళ్ళికొడుకు పెద్ద డాక్టరు. ఆమె యింక పటాల్లో యాక్టుచెయ్యదు... అంతా రహస్యంగా జరిగింది. ఇవాళే షూటింగంతా ఆఖరు... రేపు సాయంకాలమే పెళ్ళి..." అన్నాడు.

వేలాయుధం దెబ్బతిన్నవాడిలా చూశాడు. వెంటనే ముఖం కిటికీ వైపు తిప్పుకుని నిలబడిపోయాడు. బయట ఎండ బాగా ఎక్కువైనట్టుంది. గాలి స్తంభించింది. అతడు చొక్కా చివరతో మొహం తుడుచుకున్నాడు.

వెంకటేశం మళ్ళీ "ప్రేమకోసమై...." అంటూ పాట అందుకున్నాడు. వామనరావు "మంచివార్తే చెప్పావు. అంటే ఇవాళ అంతా గొప్ప హడావిడి అన్నమాట. ఇవాళే షూటింగు ఆఖరంటే మనం ఊపిరి పీల్చుకోవటానికైనా వీలుండదు. మనకున్న బుల్లిబుల్లి వేషాలన్నీ ఇంకా మిగిలేవున్నాయిగా..." అంటున్నాడు.

భైరవమూర్తి శేఖర్ దగ్గరగా జరిగి "పెళ్ళయిన తర్వాత యిక ఆమెగారు నటించడం మానేస్తుందా?" అని గుచ్చి, గుచ్చి అడుగుతున్నాడు.

శేఖర్ "అవునబ్బా! నేనేం చెప్పాను? కావాలంటే పేపర్లో చూడుమీ" అంటూ మళ్ళీ ఆ మళయాళం పేపరును అతని వొళ్ళోపడేశాడు. అతడు పేపరు విప్పి "ఏది చూపించు" అని అడిగాడు. శేఖర్ మూడవ పేజీలో ఒకచోట వేలు పెట్టి చూపించాడు. భైరవమూర్తి 'అవునయ్యా! ఇక్కడ ఆమె ఫోటో కూడా వేశారు" అన్నాడు. వెంకటేశం చప్పరించి "ఆఁ! ఆ ఫోటోకింద ఏం రాసివున్నదో మనకు తెలియదుగా..." అంటున్నాడు.

అంతలోనే క్రింద హారన్ వినిపించింది. అందరూ లేచి బిలబిలలాడుతూ హడావిడిగా మెట్లు దిగి వచ్చారు. వేలాయుధం నెమ్మదిగా తలుపుకు తాళంవేసి ఒక్కొక్కమెట్టు నింపాదిగా దిగటం ప్రారంభించాడు. ఈ లోపల వ్యానులోవారు సర్దుకు కూర్చున్నారు. మేస్త్రీ పెద్దగా కేకవేసి "ఏమయ్యా వేలాయుధం! నీకోసం ఇంకొక గంట వెయిట్ చెయ్యాల్నా! తొందరగా రావయ్యా? ఇవాళ అసలే హడావిడి. ఆమె గారి పెళ్ళి నా ప్రాణానికి వచ్చింది. ఇన్నాళ్ళూ ఈ చిల్లర మనుషులతో షూటింగ్ చెయ్యకుండా వాళ్ళేమో తాత్సారం చేశారు. ఇప్పుడు కొంప మీదికి వచ్చింది. ఇవాళే పని అంతా అయిపోవాలని ఆ ప్రొడ్యూసర్‌గారు గోలపెట్టారు. ఆయన యెప్పుడూ "నా లక్షలు నా లక్షలు"...అంటూ వుంటాడు. మీరేమో నీరసం మనుషులు దొరికారు... ఏం చేతునబ్బా" అంటూ సణుగుతున్నాడు.

వ్యానులో చోటులేదు. మేస్త్రీ, వ్యానులో చివరగా కూర్చున్న మరుగుజ్జు ఎక్స్ట్రాను కేకవేసి "నువ్వు నిలబడుకుని ఆయనగారికి చోటియ్యవయ్యా? పెద్ద లార్డులాగా కాళ్ళుజాపుకుని కూర్చున్నావు. కొంచెం ఒత్తుకో..." అన్నాడు పెద్దగా.

మరుగుజ్జు వాడివి లావుపాటి కాళ్ళూ చేతులూ, నల్లని పళ్ళెంవంటి వెడల్పయిన ముఖం... ఇవాళ అతడు సంబరం సీనులో పాల్గొనాలి. అతడు పళ్ళికిలించి నవ్వుతూ లేచి నిలబడి "మీరు కూర్చోండిస్వామీ!" అన్నాడు. వేలాయుధం సర్దుకుని కూర్చోగానే మేస్త్రీ "ఏమయ్యా డ్రయివరూ! పోనీయ్ బండిని ఇంకా దిక్కులు చూస్తూ కూర్చున్నావు" అన్నాడు.

వ్యాను కదలింది.

♦ ♦ ♦ ♦ ♦ ♦

సెట్టునిండా జనం బిలబిలలాడుతూ హడావిడిగా తిరుగుతున్నారు. చెవిటి అసిస్టెంటు డైరెక్టరు కళ్ళద్దాలు సర్దుకుంటూ సంబరం సీను చిత్రించటానికి కావలసిన ఏర్పాట్లు చూస్తున్నాడు. ఒకవైపు హీరో పాత్రధారి, తళ తళ మెరిసే రాజకుమారిడి దుస్తుల్లో అచ్చం రాజకుమారిడికి మల్లేనే ఠీవిగా కూర్చుని తన పోర్షన్ చూసుకుంటున్నాడు. ప్రొడ్యూసర్ గారు మాటిమాటికి "లక్షలు పోసి పనిచేస్తున్నాం. త్వరగా కానియ్యండి." అంటూ అందర్నీ తొందరపెడుతున్నాడు. డైరెక్టరు తాపీగా కళ్ళు మూసుకుని కుర్చీలో కూర్చుని ఆలోచిస్తున్నాడు.

ఒక పక్క సంబరంసీనులో పాల్గొనవలసినవారు దాదాపు యిరవై ముప్పయిమంది ఎక్స్ట్రాలు మొహాలకు రంగులు వేసుకుని తలలకు పాగాలతో, చేతులలో కర్రలతో, ముక్కులకూ, చెవులకూ రింగులతో సిద్ధంగా నిలబడి వున్నారు. ఒక ఎలుగుబంటి కూడా ఆ సీనులలో పాల్గొనవలసి వుంది. అది శాపవశాత్తు ఎలుగుబంటిగా మారిన రాజకుమారుడన్నమాట. దాని యజమాని ఆలస్యంగా వచ్చి కాసిని చివాట్లు తిని ఒక ప్రక్కగా నిలబడి వున్నాడు.

వేలాయుధం హీరో ప్రక్క నిలబడి వుండి ఆయన వంకే కళ్లార్పకుండా చూస్తున్నాడు. అంతలో అసిస్టెంట్ డైరెక్టరు హడావిడిగా వచ్చి అటూ యిటూ చూసి వేలాయుధంతో "ఏమప్పా. యింకా నిలబడే వుంటివి... కోటాకొట్టుకొనిరావయ్యా! తర్వాత దిక్కులే చూడవచ్చులే..." అన్నాడు.

వేలాయుధం నెమ్మదిగా నడిచి లోపలికి వెళ్ళాడు. అక్కడ సీనియర్ మేకప్‌మాన్ తప్ప మిగిలిన అందరూ తలా ఒకరికీ మొహాలకు రంగులు వేస్తున్నారు. సీనియర్ మేకప్‌మాన్ హీరోయిన్ వస్తే ఆమెకు మేకప్ చెయ్యాలి. అంతవరకూ ఆయన తన క్రింద వారిమీద అజమాయిషీ చేస్తూ అటూ యిటూ తిరుగుతూ వుంటాడు.

వేలాయుధం కుర్చీలో కూర్చోగానే గుండుమణి చేతిలో సీసాతో వచ్చాడు. "ఏమయ్యా? ఎవరో పోయినట్టు మొహం పెట్టావ్? ఏమిటి సమాచారం" అంటూ వేలాయుధం జుట్టు పైకి దువ్వి తలకు గుడ్డకట్టాడు. వేలాయుధం ఏమీ మాట్లాడలేదు. గుండుమణి అతని మొహం నిండా రంగు చుక్కలు పెట్టి ఎవరో పిలవగా "వస్తున్నా సార్..." అంటూ పరుగెత్తి పోయాడు. వేలాయుధం కళ్ళు తెరిచి ఎదురుగా అద్దంలో తన ప్రతిబింబం చూచుకున్నాడు. అతడేం అందగాడు కాదు. పైగా పళ్ళు ఎత్తు.... కళ్ళు చిన్నవి.... నుదుటి మీద, చిన్నప్పుడెప్పుడో చిన్న బిడ్డ గుణం వస్తే చుట్ట పెట్టి కాల్చారు కాబోలు, ఒక పెద్ద మచ్చ... లావుపాటి ముక్కు...దట్టమైన కనుబొమలు.

గుండుమణి పరుగెత్తుకుంటూ వచ్చి "నువ్వు ఒక్క క్షణం ఆగు సామీ; ముందు ఆయన గారికి రంగువేసి పంపాలి. హుకుం అయింది." అన్నాడు.

వేలాయుధం లేవగానే శేఖర్ నవ్వుతూ వచ్చి కుర్చీలో కూర్చున్నాడు. సినిమాలో రాజుగారి వినోదార్థం ఏర్పాటైన కుస్తి పోటీలలో శేఖర్ పాల్గొనాలి. "ఈ సీన్లు ముందు కానిచ్చేద్దాం. వనజగారు వచ్చే లోపల..." అనుకున్నారు డైరెక్టరుగారు. ఒక ప్రక్క రాజుగారికి కుమారుడు జన్మించిన సందర్భంలో ప్రజానీకం చేసుకున్న సంబరాలు, ఉత్సవాలు చిత్రిస్తున్నారు.

మేకప్‌రూంలో కొందరు ఆడవాళ్ళు మేకప్ చేయించుకుంటున్నారు. ఒకామె వేలాయుధం వంక చూసి నవ్వుతున్నది. వేలాయుధం మొహం తిప్పుకున్నాడు. నిజానికి అతనికి కూడా నవ్వువచ్చింది. అవును మరి, మొహం నిండా రంగు చుక్కలతో తన అవతారం తనకే నవ్వు పుట్టిస్తున్నది.

ఇంతలో సరస అటువైపునుంచి అతని దగ్గరికి వచ్చి అతన్ని పలుకరించి "తంగం నీ కోసం అడిగిందయ్యా. నిన్ను చూసి ఎన్నాళ్ళో అయిందట... ఒకసారి రమ్మన్నది..." అని చెప్పింది. వేలాయుధం ఏమీ మాటాడకుండా యివతలికి వచ్చేశాడు.

అంతలో బయట హడావిడి... హీరోయిన్‌గారు వచ్చారు..." అని కేక పెట్టారెవరో... వేలాయుధం దాదాపు పరుగెత్తుతూ వరండాలోకి వచ్చాడు. బయట కారులోనుంచి దిగుతున్నదామె... ఆకుపచ్చని చీరె... తెల్లని రవిక... కళ్ళకు నల్ల అద్దాల జోడు... కాళ్ళకు హైహీల్సుజోడూ...

నాయక పాత్రధారి మేకప్‌తోనే ఆమె కెదురుగా వెళ్ళి "కంగ్రాచులేషన్స్" చెప్పి వెంట బెట్టుకుని వస్తున్నాడు. డైరెక్టరూ, నిర్మాతా కూడా అలాగే ఆమెను ఆహ్వానించారు. అసిస్టెంట్ డైరెక్టరు వీలు చూచుకుని కళ్ళజోడు సర్దుకుంటూ "విష్‌యూ ఏ హ్యాపీ మేరీడ్ లైఫ్" అన్నాడు.

ఆమె నవ్వుతూ లోపలికి వచ్చింది. వెడల్పయిన లేడి కళ్ళతో చుట్టూ చూసి వేలాయుధం మీద ఒక్క క్షణం దృష్టి నిలిపి వాలకం చూసి కాబోలు చిరునవ్వు నవ్వింది. వేలాయుధం వెంటనే లోపలికి పారిపోయాడు. శేఖర్ అద్దంలో మొహం చూసుకుంటూ వుండగా అతడు వెళ్ళి కూర్చుని గుండుమణితో "ఏం పని చేశావయ్యా! కొండమంగలిలాగా... ఈ చుక్కలెందుకు పెట్టావు? అందరూ నవ్వుతున్నారు. ముందు నా పని చూడు..." అన్నాడు.

గుండుమణి పెద్దగా నవ్వి. "ఏమబ్బా. అంత సిగ్గు...సరే కానియ్ ముందు నీ పని పూర్తిచేస్తాను రా... పొద్దుటినుంచీ కాఫీ అయినా తాగలేదు. నా చేతులు పడిపోతున్నాయ్..." అన్నాడు.

అవతల సీనియర్ మేకప్‌మాన్ హీరోయిన్‌ను వెంట తీసుకువచ్చి మేకప్ ప్రారంభించాడు.

గుండుమణి "మాటి మాటికీ తల తిప్పకు సామి" అని కసురుతూ మేకప్ ముగించాడు.

◆ ◆ ◆ ◆ ◆ ◆

షూటింగ్ శరవేగంతో కొనసాగింది. రాజకుమారి చెలికత్తెలతో పాట పాడుతూ వన విహారం చేసే దృశ్యమూ, ప్రేయసీ ప్రియుల విరహ యుగళ గీతమూ, సేనాధిపతి రాజకుమార్తెను ప్రేమభిక్ష అర్థించడమూ ఇత్యాదులన్నీ త్వరత్వరగా షూట్ చేశారు.

మధ్య మధ్య హీరోయిన్ విశ్రాంతిగా కూర్చున్నప్పుడు వేలాయుధం అక్కడే ఆమె వంక చూస్తూ నిలబడేవాడు. పత్రికా విలేకరులు ఆమె చుట్టూ మూగి రకరకాల ప్రశ్నలు వేసి ఆమెచేత జవాబులు రాబట్టే ప్రయత్నాలు చేశారు. "మీరు పెళ్ళి అయిన తరువాత ఇక నటించరా?..." అని ఒకరు, "హనీమూన్‌కు ఎక్కడికి వెడదామనుకుంటున్నారు?" అని మరొకరు.

ఆమె ఉన్నట్టుండి "నాకు దాహంగా వుంది. ఎవరైనా కాసిని మంచినీళ్ళు యివ్వండి..." అన్నది. డైరెక్టరుగారు "మంచినీళ్ళేం ఖర్మ! కూల్‌డ్రింక్ తెప్పిస్తాను." అంటూ తెప్పించేలోగానే వేలాయుధం తళ తళలాడే గాజుగ్లాసులో చల్లని మంచినీళ్ళు తెచ్చి ఆమెకు అందించాడు. ఆమె కూల్‌డ్రింక్ తీసుకోవాలా, మంచినీళ్ళు తీసుకోవాలా అని ఒక క్షణం ఆలోచించి చివరకు నవ్వుతూ వేలాయుధం చేతిలోనుంచి మంచినీళ్ళ గ్లాసు అందుకున్నది. వేలాయుధం ఆమె చేతివేళ్ళు తన చేతికి తగలగానే కరిగిపోయాడు.

డైరెక్టరుగారు హడావిడిగా వచ్చి "అమ్మణ్ణి! ఇక ఒక సీనే మిగిలింది. అది పూర్తియితే తమరు వెళ్ళవచ్చు. అది తొందరలో వీలుపడేటట్టు లేదే-" అన్నారు, అనుమానిస్తూ.

విలన్‌గారు వేరొకచోట పనిలో వున్నారు. ఆయన వెంటనే వచ్చేందుకు వీలుపడదు. అదీ ఫోనుమీద చేరిన సమాచారం. ఇప్పుడేం చేసేట్టు? ఆమె చేతి గడియారం చూసుకుని తల అడ్డంగా ఊపుతూ "లాభం లేదు. ఏ పరిస్థితులలోనూ మరొక గంటకంటె ఇక్కడ ఉండలేను" అన్నది.

అందరూ హడావిడి పడ్డారు. విలన్‌గారికి ఫోన్ చేశారు. ఆయన అసిస్టెంట్ డైరెక్టరుమీద కోప్పడి "నేను మామూలుగా ఇచ్చిన కాల్ షీట్లు ఇక్కడ పూర్తి కావాలి. మీరు షెడ్యూలు ముందుకు నెట్టారు. నేనా అందుకు బాధ్యుణ్ణి? మరో రెండు మూడు గంటల వరకూ నాకు ఫోను కూడా చెయ్యకండి. ఇక్కడ పీకల లోతున పనిలో మునిగి వున్నాం అందరమూ" అని ఫోను పెట్టేశాడు.

డైరెక్టరుగారికి గొప్ప ఆలోచన తట్టింది. విలన్ రాజకుమారి నిద్రిస్తూండగా వచ్చి ముక్కులకు మత్తుమందు వాసన చూపించి ఆమెను భుజాలమీద వేసుకుని వెళ్ళిపోవాలి. విలన్ ఆపాదమస్తకమూ నల్లని ముసుగు ధరించి వస్తే సరి. "ఓస్" ఏం దిగులు పడనక్కరలేదు. దానికి విలన్ పాత్ర అక్కరలేదు. ఆ మాత్రం ఒడ్డూ, పొడుగూ వున్న మనిషి ఎవరైనా పనికి వస్తారు. "లక్షలు లక్షలు" అంటున్న ప్రొడ్యూసర్ మొహం వికసించింది. "అయితే ఆ మనిషిని చూసి త్వరగా కానివ్వండి" అన్నాడు.

అందరూ అక్కడే చేరారు. డైరెక్టరుగారు అందరి ముఖాలవైపు తీక్షణంగా చూశాడు. వేలాయుధం మీదికి ఆయన చూపులు రాగానే గొంతు సర్దుకుని ముందుకు జరిగాడు. డైరెక్టరుగారు సైగచేసి "ఇటురా" అన్నాడు. వేలాయుధం ముఖం వికసించింది. అతడు

ముందుకు రాబోతే "నువ్వుకాదు ఆ వెనక మనిషి" అన్నాడు డైరెక్టరు. వేలాయుధం ముఖం వ్రేలాడవేసుకుని వెనుదిరిగి చూశాడు. భైరవమూర్తి.... అతడు డైరెక్టర్ వెంట లోపలికి వెళ్ళాడు. మేకప్ జరుగుతూ వుండగానే సలహాలు సూచనలూ అన్నీ జరిగిపోయాయి.

మరి కొద్ది నిముషాల్లో భైరవమూర్తి నల్లని ముసుగు మనిషిగా ఇవతలికి వచ్చాడు. వేలాయుధం మనసులో అసూయ వ్రేళ్ళుతన్ని మహా వృక్షమైంది.

రిహార్సల్.. విలన్ గోడమీదుగా గదిలోకి వచ్చాడు. కెమెరా మరోవైపుకు తిరిగింది. రాజకుమారి హాయిగా నిద్రిస్తున్నది. ఆమె గుండెలకు ఎదురుగా కొంచెం ఎత్తున కెమెరా... విలన్ నెమ్మదిగా నడిచి మంచం పక్కకు వచ్చాడు. ఒక్క క్షణం ముసుగు లోపలి కళ్ళు మెరిశాయి. అతని చేతులలో ఏదో మందు వుంది. దాన్ని ఆమె ముక్కులవద్ద వుంచాడు. రాజకుమారికి స్పృహతప్పింది. విలన్ ఆమెను లేవదీసి భుజాల మీద వేసుకుని నెమ్మదిగా నడిచి వెళ్ళాడు.

వేలాయుధం మనసు ఉడికిపోతున్నది. అతడు మాటిమాటికీ మొహం తుడుచుకుంటూ కళ్ళార్పకుండా అటే చూశాడు. "భైరవమూర్తి ఎంత అదృష్టవంతుడు..." అనిపించిందతనికి.

ఆ సీను అయిపోగానే అందరూ మేకప్ తుడుచుకుంటున్న హీరోయిన్ దగ్గరికి చేరారు. అందరూ తలా ఒకవైపునుంచి శుభాకాంక్షలు తెలుపుతూ వుండగా, కొన్ని కెమెరాలు క్లిక్ మంటూ వుండగా ఆమె చిరునవ్వు నవ్వుతూ అందరి దగ్గరా సెలవు తీసుకుంది. పెద్దలందరూ ఆమెను కారు వరకూ సాగనంపి వచ్చారు.

తర్వాత యుద్ధం సీను చిత్రించారు. చాలామంది ఎక్స్ట్రాలు కత్తులు తిప్పుతూ ఒకరితో ఒకరు పోట్లాడుకున్నారు. వేలాయుధం ఇద్దరు శత్రువులను నేలగూల్చి తర్వాత వీరమరణం పొందాడు.

◆ ◆ ◆ ◆ ◆ ◆ ◆

నగరమంతా లైట్ల వెలుగులో పట్టపగలువలె మెరిసిపోతున్నది. బజారులన్నీ వచ్చేపోయే విలువైన కార్లతో, బస్సులతో నిండివున్నాయి. ఆ కార్లనిండా, బస్సులనిండా హాయిగా నవ్వుతూ ఎంతోమంది అదృష్టవంతులున్నారు.

వేలాయుధం పేవ్‌మెంట్‌మీద నెమ్మదిగా నడుస్తున్నాడు. అతని చొక్కా జేబులో మూడు రూపాయల చిల్లరవుంది. అతని ముఖం కళావిహీనమైవుంది. అతని మనసులో దిగులు గూడు కట్టుకుని వుంది.

అతని హఠాత్తుగా తంగం గుర్తుకు వచ్చింది. ఆమెకు ముప్ఫయి యేళ్ళుంటాయి. చాలా యేళ్ళ క్రిందట అయినవారి నందరినీ వదలిపెట్టి సినిమా పిచ్చితో ఇక్కడికి పారిపోయివచ్చింది. వేలాయుధానికి ఆ రోజులు బాగా గుర్తు. అప్పటికతడు ఆ వూరికి కొత్త. మొదట్లో తంగం బాగానే వుండేది. కాని, తర్వాత ఆమె స్థితిబాగా చెడింది. అమాయకురాలు కావడంవల్ల అందర్ని నమ్మింది. బాగా వున్నప్పుడామెను అందరూ చేరదీశారు. ఇప్పుడు దూరంగా తోసేశారు. ఇప్పుడామెకు సంవత్సరంన్నర వయసుగల ఆడపిల్ల వుంది. ఆ పిల్లే ఆమెకు సర్వస్వం. ఆ పిల్ల బొద్దుగా బాగుంటుంది. అప్పుడప్పుడు

సినిమాలోకి పసిపిల్లలు కావలసి వస్తారు. అటువంటి అవకాశం దొరికితే తంగం తన పిల్లను ఎత్తుకుని తయారవుతుంది. అలా తంగం సంగతి ఎలా వున్నా ఆ పసిపిల్ల మాత్రం ఇప్పటికి రెండు మూడు సినిమాల్లో నటించింది.

వేలాయుధం అంటే తంగం పడి చస్తుంది. అందుకు కారణం ఏమిటో వారిద్దరికీ తెలీదు. వేలాయుధం ఆమెపట్ల వైముఖ్యం పెంచుకున్నాడు. అతనికి శరీరం అమ్ముకుని బ్రతికే ఆడవాళ్ళంటే రోత...

తలమీద నాలుగైదు వర్షపు చినుకులు పడేసరికి అతడు తల పైకెత్తి చూశాడు. వర్షం వచ్చే సూచనలైతే వున్నాయిగాని వేలాయుధం మాత్రం ఖచ్చితంగా "వర్షం రాదు..." అనుకున్నాడు.

తర్వాత అతడు ఎదురుగా వున్న పెద్ద హోటలులోకి వెళ్ళి అదనపు పదార్థాలతో సుష్టుగా భోజనం చేశాడు. తర్వాత త్రేన్చుకుంటూ వాకిట్లోకి వచ్చి కిల్లీ వేసుకుని సిగిరెట్టు ముట్టించుకుని పొగ లోపలికి పీల్చి వొదిలి మెట్లు దిగి నడవటం ప్రారంభించాడు.

పెద్ద బస్సు ఒకటి రొద చేసుకుంటూ, రోడ్డుమీద వెళ్ళింది... పాతకాలపు మోడలు డొక్కు కారు ఒకటి నిండా మనుషులతో, నెమ్మదిగా వెళ్ళింది. నల్లని వాడొకడు ఏదో సినిమా పాట పాడుకుంటూ నడచిపోతున్నాడు. అడుక్కుతినే వాడొకడు యింటింటి ముందూ ఆగి "తాయీ" అంటూ కేకలు పెడుతున్నాడు. ఇంగ్లీషు సినిమా వాల్‌పోస్టర్లో ఒక ఆడదీ మొగవాడూ బహిరంగంగా ముద్దుపెట్టుకుంటున్నారు. ఎదురుగా వచ్చే కారులో ఒక ప్రఖ్యాత నటుడున్నాడు. అవును... బహుశ షూటింగ్ ముగించుకుని ఇంటికి పోతున్నాడేమో!

చల్లని గాలి వీస్తున్నది. ఈ తంగం అంటే తనకు రోత. దాని పసిపిల్ల అంటే రోత... దాని ఇల్లంటే రోత.... ఆ సందూ, వీధీ...అన్నీ రోత... అయినా యిప్పుడు వెళ్ళక తప్పదు. రేపు సాయంకాలమే పెళ్ళి...

'తంగం యీ వీధిలోనే వుంటుంది. ఇప్పుడాయింట్లో ఏడున్నాడో ఏమో! పాడుగోల... అయినా తలుపుతట్టి చూద్దాం..." అనుకుంటూ తలుపు తట్టాడు.

తంగం తలుపుతీసి "యారు?" అని అడిగింది. మరుక్షణంలో ఆమె వేలాయుధాన్ని గుర్తించింది. ఆమె ముఖం వికసించింది.

"రా. లోపలికి... శాన్నాళ్ళకు మా మీద దయ కలిగిందే..." అన్నది.

వేలాయుధం నవ్వి లోపలికి అడుగుపెట్టాడు. ఒకసారి యిల్లంతా కలయజూశాడు. గది మధ్యలో ఉయ్యాలలో గుప్పిళ్ళు ముడుచుకుని పసిపిల్ల నిద్రపోతున్నది. మునుపు ఆ మూల కుర్చీ ఒకటి, బల్ల ఒకటీ వుండాలి. ఏమయ్యాయో మరి?

తంగం మంచం వాల్చి ఎర్రని పళ్ళు కనిపించేలా నవ్వి "బొమ్మలాగా నిలబడిపోయావే. కూర్చో సామీ!... నీ సొమ్మేం పోదులే... నిన్న సరస మాట్లాడితే సమాధానమే చెప్పలేదటగా..." అన్నది.

వేలాయుధం ఉయ్యాల దగ్గరగా వెళ్ళి పసిపిల్లను చూశాడు. పిల్ల మొహంలో మంచికళ ఉంది. ఏమో దాని నుదుటి వ్రాత ఎలా వుందో.

తంగం పిల్లమీద గుడ్డసరిగా కప్పుతూ "సాయంకాలం పిల్లను స్టూడియోకు తీసుకుపోతిని. అక్కడ అంతా ఇంతా గోలకాదు. అందరి కళ్లూ మా అమ్మణ్నిపైనే... ఎట్లా నవ్విందనుకున్నావ్! పది రూపాయలు సంపాయించింది. కాస్సేపట్లో!" అన్నది. వేలాయుధం ఆమె వంక చూశాడు. ఆమె కళ్లు మెరుస్తున్నాయి. తంగం అందగత్తె... పచ్చని వొంటిరంగు... పెద్ద పెద్ద కళ్ళు... తీర్చిదిద్దినట్టుండే అవయవాలు... మునుపు యింకా బాగుండేది.

తంగం లోపలికి వెళ్ళబోతూవుంటే వేలాయుధం "సాపాటు అయింది. కాసిని మంచినీళ్ళివ్వు..." అన్నాడు.

ఆమె వెనుదిరిగి నవ్వి "అవున్లే... నువ్వు నా యింట్లో ఎందుకు తింటావులే..." అన్నది. తర్వాత వెళ్ళి మంచినీళ్ళు తీసుకొచ్చి, క్రింద వుంచబోయింది. "చేతికివ్వగూడదా?" అన్నాడు వేలాయుధం. "కూడదు... నువ్వు మైలపడతావని..." అన్నది తంగం నవ్వి

నీళ్ళు తాగుతూ వేలాయుధం ఆమెవంక పరీక్షగా చూశాడు. ఆమె నవ్వుతున్నది. ఆ నవ్వులో జీవం వున్నది. సరదా వుంది. ఆమె మెళ్ళో తళతళలాడుతున్న రెండు పేటల బంగారు గొలుసు వుంది. వేలాయుధం ఆమె చేతిని పట్టుకుని తన ప్రక్కన కూర్చోబెట్టుకున్నాడు. తంగం మెరుపు మెరిసినట్టు నవ్వింది.

♦ ♦ ♦ ♦ ♦ ♦

మహావైభవంగా పెళ్ళి జరుగుతున్నది... పెద్దపందిరి... పందిరి నిండా విలువైన కుర్చీలు... కుర్చీలలో విలువైన మనుషులు... వారి ఖరీదైన నవ్వులు...

వాతావరణమంతా స్వర్గతుల్యంగా వుంది. వేలాయుధం మొదటి వరుస కుర్చీలో ఒకదాన్లో కూర్చుని వున్నాడు. అతడు ఖరీదైన సూటులో వున్నాడు. చేతిలో ఖరీదైన సిగరెట్ టిన్ వుంది. అటూ యిటూ వున్న వారితో ఉండి ఉండి మాటాడుతున్నాడు. ఉండి ఉండి చురుకైన కళ్ళతో కళ్యాణ వేదిక మీదనున్న పెళ్ళికొడుకునూ, పెళ్ళికూతురినీ చూస్తున్నాడు.

చదివింపులవేళ... పెద్దలందరూ వివిధమైన కానుకలను చదివించారు. వేలాయుధం చక్కని పచ్చరాయి పొదిగిన ఉంగరం ఒకటి తీసుకుపోయి చదివించాడు. వధువు ఉంగరం అందుకుంటూ అతని వంక కళ్లు పెద్దవి చేసుకుని చూసింది. వేలాయుధం విషాదంగా నవ్వి ఇవతలికి వచ్చేసి జేబు రుమాలుతో కనురెప్పలు తుడుచుకున్నాడు. తర్వాత అతని కేమీతోచలేదు. చేతులు రెండు తుడుచుకున్నాడు, తర్వాత వ్రేళ్ళు విరుచుకున్నాడు. ఆవులించాడు. తర్వాత నెమ్మదిగా నడవటం ప్రారంభించాడు.

ఇంతలో గేటు దగ్గర అతన్ని చూసి సరస త్వరత్వరగా నడచి వచ్చింది. ఆమెను చూడగానే వేలాయుధం గుండెలు దడదడ లాడాయి. అతడు గబగబా పరుగెత్తుకుపోయి ఖాళీ రిక్షాలో ఎక్కి కూర్చుని "పోనియ్" అన్నాడు. సరస ఆగిపోయి పక్కనున్న ఆమెతో "దొంగ సచ్చినోడు. తంగం దగ్గర బంగారు గొలుసు కాజేశాడు. పట్టుబడితే చెప్పుతీసి పళ్ళూడగొట్టేదాన్ని తప్పించుకు పోయాడు" అన్నది.

♦ ♦ ♦ ♦ ♦ ♦

వామనరావు మెట్లెక్కి పైకి వెళ్ళేసరికి ఇంకా తాళం అలాగేవుంది. అతడు ఉస్సురని నిట్టూర్చి "బాగానేవుంది. దరిద్రుడు తల కడిగితే వడగళ్ళ వానట. మనవాడి దగ్గిర నాలుగు డబ్బులుండాయేమో కూడు తిందామని వస్తే ఎన్నిసార్లు తిరిగినా తాళం ప్రత్యక్షం..." అనుకుంటూ పంచలో అలాగే కూర్చున్నాడు. బాగా అలిసిపోయి అందులోను ఆకలితో వున్నాడేమో అతనికి అంతలోనే నిద్రపట్టింది.

అతనికి మెలకువ వచ్చేసరికి తలుపుతీసింది. అతడు ఒక్క గెంతులో లోపలికి వెళ్ళి చూశాడు. వేలాయుధం జాడ అయితేలేదు. గాని క్రింది చాపమీద ఒక పొట్లమూ చిన్న కాయితం కనిపించాయి. అతడు కాయితం తీసుకుని చదువుకున్నాడు.

"వా॥ మూర్తీ, నేను వెళ్ళిపోతున్నాను. ఎక్కడికి పోతున్నానో నాకే తెలియదు. మళ్ళీ వస్తానో రానో కూడా తెలియదు; ఈ ప్యాకెట్‌లో సూటువుంది. దాన్ని పెద్దబజారులో శ్రీలాండ్రీలో ఇస్తే వాళ్ళు పాతిక రూపాయలిస్తారు. ఆ డబ్బు నువ్వు వాడుకోవచ్చు. తంగం యింటికి పోయి వేలాయుధాన్ని క్షమించమని చెప్పవలసినది. ఇట్లు వేలాయుధం" అని వుంది.

వామనరావు నివ్వెరపోయి క్రిందికి పరుగెత్తుకుంటూ పోయాడు. ఇక ఒక పావుగంట క్రితం వేలాయుధం వచ్చి మళ్ళీ అంతలోనే వెళ్ళిపోయాడని చెప్పారు క్రింద వుంటున్నవారు.

◆ ◆ ◆ ◆ ◆ ◆

ఒకానొక చిత్రం షూటింగు సందర్భంలో వామనరావు, భైరవమూర్తి, వెంకటేశమూ కలుసుకున్నారు. ముగ్గురూ రాజభటుల వేషాలలో వున్నారు.

భైరవమూర్తి సిగిరెట్లు ముట్టించుకుని హఠాత్తుగా "అన్నట్టు ఈ మధ్య నాకు ఒంగోలు స్టేషనులో వేలాయుధం కనిపించాడు" అన్నాడు.

మిగిలిన ఇద్దరికీ ఆదుర్దా హెచ్చి ప్రశ్నల వర్షం కురిపించారు. అక్కడే పిల్ల నెత్తుకుని నిలబడి వున్న తంగం ఈ సంభాషణ విని దగ్గరకు వచ్చింది.

"జుట్టు బాగా పెరిగింది. మనిషి నీరసించి పుల్లలాగా అయిపోయాడు. అసలు గుర్తుపట్టేందుక్కూడా కష్టమైపోయింది. భోజనాల రూము దగ్గర నిలబడి ఆకలయితే వారి ముందూ వీరి ముందూ చేతులు జాపి నిలబడతాడు. తర్వాత ప్లాటుఫారం మీద చెట్టుకింద పడుకుంటాట్ట... నేను పలుకరిస్తే నన్ను వింతగా చూసి వెళ్ళిపోయాడు." అని చెప్పాడు భైరవమూర్తి.

"అక్కడేవున్నాడా ఇప్పుడు?" అని అడిగింది తంగం ఆదుర్దాగా.

భైరవమూర్తి తలవూపి లేస్తూ "ఉహూ; అటువైపు వెళ్ళే రైల్లో నేను చూస్తూ వుండగానే ఎక్కాడు. ఎక్కడికి పోయాడో ఏమో!" అన్నాడు.

తంగం దూరంగా వెళ్ళి కళ్ళు తుడుచుకున్నది.

◆ ◆ ◆